ఆడదానికి జడ ఎంత సొగసో మగవారికి మూతికి మీసం కూడా అంతే - తుమ్మెదరెక్కల్లాటి మీసాలు బుగ్గలకు తగిల్తే కితకితలుపెట్టి నవ్విస్తాయి. మరీ కృష్ణదేవరాయల్లాటి మీసాలక్కర్లేదు గాని మూతికి ఓ మోస్తరు మీసంకూడా అందవే.... మీసాల్లేకపోతే తుచ్ఛసుఖములన్నీ మీసాలపై తేనియల్ అని ఎలా తెలుస్తుంది? మీసాలు లేనివాళ్ళకి (ఆడవాళ్ళకు కొందరు మగవాళ్ళకు పిల్లలకు) తుచ్ఛ సుఖములు మీసాలపై తేనియల్ కావా? ఏవిటో పెద్దనగారుకూడా ఇలా అవకతవకగా రాస్తారు?

స్త్రీ పురుషులమధ్య ప్రేమకలగటానికి మీసాలు దోహదకారులా. కావా అను విషయంపై హనుమాయమ్మ "ప్రేమకి మీసాలు" అని నవల రాసింది. ఆవిడ ఇదివరలో సీరియల్‌గా రాసిన "వలపులగిలక" చదివిన పాఠకులు "ప్రేమకి మీసాలు" లాటి నవల ఛస్తే మళ్ళీ మీరు రాయలేరని ఆవిడతో పందెం కాశారట. "ప్రేమకి మీసాలు" సీరియల్‌లో కథానాయకుడు మీసాల్నెక్కువగా ప్రేమిస్తున్నట్లు కథనాయికను తక్కువగా ప్రేమిస్తున్నట్లు హీరోయిన్‌కి అనుమానం కలుగుతుంది. వెంటనే ఆవిడ ఆ మీసాల్ని తీసేయమంటుంది. మీసాల్ను అంతగా ప్రేమించిన ఆ హీరో తన మీసాల్ను తీసేస్తాడా. రబ్బరుబంతిలాగ, గులాబ్‌జామ్ లాగ, తొక్కుడులడ్డూలాటి ప్రేయసి ప్రేమను వదులుకుంటాడా? అబ్బ చెడ్డ సస్పెన్స్... "ప్రేమకి మీసాలు" నవల మీరు చదవలేదా? చదవకపోతే మీ జన్మ జన్మంతా వేస్టే....

## "కాఫీ" యుద్ధాలు

**"కాఫీ** యుద్ధాలని" జరిగేవి మా ఇంట్లో - చద్దెన్నాలను తెచ్చి కాఫీకి పోటీ పెట్టేవారు. కొంపలోకి కాఫీని ప్రవేశ పెట్టడం అంటే అంటు వ్యాధినో మహమ్మారినో ప్రవేశపెట్టినట్లు. కొంప గుండవై పోతుందని పెద్దవాళ్ళు లబలబలాడి పోయేవారు. ఇంగ్లీషు చదువులూ, క్రాఫింగులూ ముందూ, కాఫీలు కొంచెం వెనుకా కొంపల్లో ప్రవేశించాయి. అశుభ ప్రాప్తమ్మగు కలియుగంబు కాఫీతో పాదమ్మిడియెన్ అని మా వాళ్ళంతా నమ్ముతూండేవారు. ఇప్పుడు సోషలిజాన్ని ప్రవేశ పెడతామని కాంగ్రెస్ వారు సరదాకి నోరు జారగానే ముసలి పులులు కంగారు పడినట్లుగా, బ్యాంకులను జాతీయం చేయటం సమస్య కంటె చిక్కు సమస్య అయిపోయింది కాఫీ ప్రవేశం ఆరోజుల్లో.

మాకు కొంత మంది ఇంగ్లీషు చుట్టాలు వచ్చినప్పుడల్లా ఎవరి కాఫీపొడి వారే తెచ్చుకునేవారు. కాని అప్పుడప్పుడు బిళ్ళల కాఫీ త్రాగాలిసొచ్చినప్పటికీ కాపీ వాదులకూ నాన్ కాఫీ వాదులకూ ఎక్కడా సయోధ్య కుదిరేదికాదు. మా వాళ్ళు కాఫీ కుంపటి అని ఓ కుంపటిని యివతల తగలేసేవారు. ఆ కాఫీ వడపోసిన గుడ్డ వాసనకే మురిసిపోయిన పనిమనిషి

కాఫీ గ్లాసుల్నీ, కాఫీ గిన్నెల్నీ అవలీలగా కడిగేసేది. ఇప్పటికి అంట్ల గిన్నెల్ను తోమడం కంటె కాఫీ గ్లాసుల్ని తోమటం సింబల్ ట్రిక్‌గా చాలా ఎలిమెంటరీ విషయంగా గృహరాణులు భావిస్తున్నారు. పిల్లలకి కాఫీ పట్టటం చాలా అవుట్ రేజియస్ యాక్టుగా థింక్ చేయబడేది.

మొగుడి సంతోషం కోసం చాటునా మాటునా దొంగతనంగా కాఫీ తాగే ఆడది మొగుడి సంతోషం కోసం బ్రాంది పుచ్చుకున్న ఆడదానిలా చూడబడేది. కాఫీ మరిగిన కాంతలకు పుట్టింటి నుంచి కాఫీ గుండా పంచదారా పాలకర్చుకు పాకెట్ మనీ (ఆడాళ్ళకు పాకెట్లుండవు ఖర్మ. జాకెట్ మనీ అనొచ్చో అనకూడదో...) రహస్యాతి రహస్యంగా అంచెలమీద వచ్చి చేరుతూండేది. పడగ్గదిలో మంచం క్రిందనే చిన్న కుంపటి వెలిగించి కాఫీ సంసారం సాగించే వొదిన్లని నేను ఎంతమందినో ఎరుగుదును. చద్దెన్నంతినే అన్నయ్యలు క్రమేపీ కాఫీ మతం పుచ్చుకుని మతాంతరులు కావటం. కొంపలో రాద్ధాంత సిద్ధాంతాలు జరగటం, కాఫీ కుంపట్లు - కుంపట్లు చిన్నవే అయినా, తెలంగాణ సమస్యలా తయారవటం ఆరోజుల్నుంచీ వుంది. ఒకవేళ మా వదినలు పొరపాటున మాచేత ఒక అవున్స్ అరవున్స్ కాఫీ తాగించినా అది మాకు యివిడేది కాదు. ఇంత డోకొచ్చే పదార్థాన్ని ఎలా పుచ్చుకుంటారని బుగ్గలు నొక్కుకునేవారు.

అన్నయ్యలూ, వొదిన్లూ, అక్కయ్యలూ బావలూ కాఫీ ముద్దులని పెట్టుకునే వారనుకుంటాను. ఈ కాఫీ ముద్దులవలన స్త్రీ పురుషులకు ఒకరి నుంచి ఒకరికి కాఫీ అలవాటు వ్యాపించి వుండవచ్చునని నా ఊహసుమండీ. పిప్పరమెంట్లు చాక్లెట్లు తినే పిల్లల్ని ముద్దెట్టుకుంటే తీయగా హాయిగా వున్నట్లు (ఒళ్ళంతా బంక చేసుకుని జీడికారిపోయే పిల్లల సంగతి కాదు నేను చెప్పేది. వాళ్ళూ ముద్దొస్తారు. కాని ముద్దుపెట్టుకోకూడదు) కాఫీ తాగగానే ఒక ముద్దు కొసరుగా వేసుకుంటే ఆ రోజుకి లైఫ్ ఫ్రెష్‌గా తాజాగా నవనవలాడిపోతూన్నట్లు వుంటుంది. పెద్దవాళ్ళు కాఫీ అంటు అని మల్లె అంటు, మామిడి అంటులాగ ఒక అంటుని లేవదీసి దానికి కొన్ని రూల్సుని బ్రహ్మసూత్రాల్లాగ తయారు చేశారు. కాఫీ డబ్బా యితర డబ్బాలకు తగలకూడదు. కాఫీ డబ్బా ముట్టుకున్న చేత్తో యింకేది ముట్టుకున్నా కొంప మునిగిపోయినట్లే.

నేను చిన్నప్పుడు ఆల్ యంగ్ గరల్స్ లాగే ఆవకాయ గోంగూర వగైరాల్తో చద్దెన్నం లాగించేసేదాన్ని. పెళ్ళయాక కాపరానికొచ్చాక కూడా చద్దెన్నంతిని కాఫీ తాగటంకాని, కాఫీత్రాగి చద్దెన్నం తినటంకాని చేస్తూండేదాన్ని. పిల్లలు పుట్టుకొచ్చాక పిల్లల్తో కలిసి చద్దెన్నం తినటం బావోదని చద్దెన్నం చాప్టర్‌కి ఫులిస్టాపు పెట్టా. మనవారు చద్దెన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదని అన్నారు. తిన్నా తినకపోయినా ప్రతి ఆడదీ మొగుడి ఆకలి ఎరిగుండాలని నేను నమ్ముతున్నాను.

అందిన మేరకు ఆడాళ్ళు చిరుతిళ్ళు సేవిస్తూంటారు. అలాగే మగాడు బయట మేసొస్తాడు. అనాది కాలం నుంచి మగాడు బయట మేసి వస్తున్నాడు. హోటళ్ళను మరిగిన మగాళ్ళకు పెళ్ళాల అభిరుచులు తెలియవని యిపుడిపు డంటున్నారనుకోండి! ఆకలి అనేది ఎటువంటి

దయినా అది పరమ డేంజరస్. అంచాత కడుపునిండిన వారు చెప్పే కమ్మటి కబుర్లను వినకూడదు. ఒకవేళ వింటే ఆలోచించాలిసుంటుంది. ఆలోచించాలంటే కాఫీ తాగాలి. ఆకలి తీరాలంటే చద్దెన్నం తినాలి. డబల్ బుల్లక్ కార్ట్ అనగా రెండెడ్ల బండిని రిప్లేస్ చేసే సరుకేదీ మన కంట్రీలో లేనట్లే, చద్దెన్నాన్ని రిప్లేస్ చేయగల పవర్‌ఫుల్ టిఫిను యింత వరకూ కనిపెట్టబడలేదు. చద్దెన్నం తినకపోతే లేచి తిరగటానికి కూడా సత్తువ వుండేదికాదు.

మా యింట్లో కాఫీ యుద్ధాలు జరిగే రోజుల్లో మా మేనత్త మొగుడొకాయన వుండేవారు. ఆయన్ని కొందరు ఇంగ్లీషు మావయ్యనీ గ్రామరు మావయ్యగారనీ అంటూండేవారు. ఆయన గుమ్మంలో అడుగుపెడుతూనే పిల్లల్ని ఇంగ్లీషులోనో లెక్కల్లోనో ఎన్ని మార్కులొచ్చాయని అడిగేవాడు. పనిలో పనిగా ఇంగ్లీషు గ్రామర్లో ప్రశ్నలడిగే వాడు. అలా అలా గ్రామర్లోంచి లెక్కల్లోకి దిగిపోయేవాడు. వాళ్ళ పిల్లల స్టాండర్డ్ చాలా హెచ్చు అనీ, మేవు జంగిలీలవనీ ఆయన యిట్టే తేల్చిపారేసేవాడు. ఆయన మళ్ళీ వాళ్ళ వూరు వెళ్ళి పోయేదాకా మాకు చెడ్డ యిబ్బందిగా ఉండేది. పిల్లలంటే సరదాపడే వాళ్ళూ, పిల్లలను "డేంజరస్ గూడ్స్"గా చూసేవాళ్ళు అని చుట్టాలలో రెండు వైరైటీలున్నాయి. మాకు కూడా కొంచెం కొంచెం తీర్థం యిచ్చినట్లు గొంతుకలో పోస్తూండటం వలన తిరిగి వెళ్ళిపోయే రోజున మా అందరి చేతుల్లో తలో బేడా పెట్టి గ్రామరు బాగా చదువుకోమని చెప్పటం వలన ఇంగ్లీషు మావయ్య అంటే కొంత యిష్టమూ, కొంత అయిష్టమూవున్నా ఆయన కొంపలో కాఫీ పీఠం బలపడటానికి మూల కారకుల్లో ఒకరుగా గుర్తుకొస్తాడు.

అడపా దడపా చుట్టాలు వచ్చి తొంగిచూసి పోతుంటేకాని ఇల్లు అనే పదార్థానికివున్న పరమార్థం చక్కగా బోధపడదు. ఇప్పుడిప్పుడు "చుట్టాన్ని చూడగానే" బస్సు టైములు రైళ్ళ రాకపోకలు కంఠతాపట్టి వప్పగిస్తున్నారు కాని, వెనకటి రోజుల్లో బంధువులెవరైనా వచ్చారంటే ప్రాణం లేచొచ్చేది. ఇరుకు కొంపలూ ఇబ్బందులూ, ఆర్థిక కారణాల వలన పట్నవాసాల్లో, యిపుడిపుడు పిలవని పేరంటంగా వచ్చిన చుట్టాలను వారివారి అంతస్తుల్ని బట్టి తెచ్చి పెట్టుకున్న మర్యాదల్తో ఆదరించడం జరుగుతోంది కాని, కారణాలేవైనా కృత్రిమ మర్యాదలు, మేలురకం చిరునవ్వులూ, ఆపేక్షలూ, అభిమానాలనూ అభినయించడం ఇవి శరీరారోగ్యానికి అట్టే మంచివి కావు.

మా ఇంటి కెవరయినా చుట్టాలొస్తే వాళ్ళతో కాఫీ తాగొచ్చని నాకు చెడ్డ సరదాగా వుండేది. ఈ కాఫీ యుద్ధాలు చాలా పాత కాలం నాటివి. ఇప్పుడు మా ఊళ్ళో కాఫీ హోటళ్ళు సైతం వెలిశాయి. అందరి యిళ్ళలోనూ కాఫీ కుంపట్లు వెలుగుతుంటాయి. కాఫీ డబ్బులని కాఫీ కర్చులనీ దండుకోవడం అక్కడా మామూలయిపోయింది. ముసలమ్మలుకూడా "కొంచెం కాఫీ వుందే పిల్లా నీరసం వస్తోంది" అంటున్నారు. తతిమ్మా వర్గాల ప్రజలు కూడా టీ సుక్కలకి కాఫీ సుక్కలకి తాపత్రయపడ్డం ఎక్కువైంది.

పాలు, పెరుగు, నెయ్యి యీ మూడిటిమీదా దెబ్బతీసిన "కాఫీ" సామాన్యుడి జీవితం సాఫీగా నడవకుండా ఎప్పుడూ అడ్డు తగుల్తూనే వుంటుంది. మన కుటుంబ జీవితాన్ని మన అలవాట్లను తారుమారు చేసి మన బడ్జెట్‌పై పెద్ద దెబ్బతీసిన "కాఫీ" ప్రవేశానికి ఎదురొడ్డి పోరాడిన అలనాటి కాఫీ విరోధుల్ని సంస్మరిస్తూ లేచి నిలబడి ఒక గుక్కెడు కాఫీ తాగుదాం!

# హనుమాయమ్మ డైరీలు

మనం బ్రతికుండగా మన రచనలపట్ల జనం ఇంకా మోజు కలిగి వుంటే దానిని 'గ్లామర్' అనొచ్చు. మనం చనిపోయాక కూడా మన రచనల పట్ల ఇంకా జనం భక్తి శ్రద్ధల్ను కనబరిస్తే దాన్ని కీర్తి కింద జమకట్టవచ్చు. క్రిటిక్స్ అని పేరెట్టుకున్న వాళ్ళు అప్పుడప్పుడు తిరగబడి మన "గ్లామర్" మీద దెబ్బతీస్తూ వుంటారు. వీరే మనం చనిపోయిం తర్వాత మన డైరీలనూ మన ఉత్తరాలనూ కెలికి మనకులేని గొప్పతనాన్ని అంటకట్టి మనల్ని కీర్తిశేషుల్ని చేస్తారు. క్రిటిక్స్ అగస్త్య భ్రాతలూ హనుమాయమ్మ మొగుళ్లూనూ, వాళ్ళు మనమీదపడి బ్రతుకుతూంటారు. పొలిటీషియన్స్‌లో కింగ్ మేకర్స్ అని వుంటారు. ఈ క్రిటిక్స్ ఆ బాపతు సరుకే. తెలుగులో మన అదృష్టవశాత్తూ మంచి క్రిటిక్స్ లేరు. ఉన్న వారిలో చాలా మందికి మోడ్రన్ రైటింగుపట్ల సానుభూతిలేదు. క్రిటిక్స్ అనే బాపతు జనం వుంటే వాళ్ళు ఓల్డుక్లాసిక్స్ మీదపడి బ్రతుకుతూంటారు. ఇహపోతే ఇంగ్లీషు చదువుకున్నవారు పాశ్చాత్య సాహిత్యం మోజులో మనల్ని గుర్తించనే గుర్తించరు. తెలుగు రైటింగ్‌ని ఎవరూ ఆట్టే పట్టించుకోరు. ఇప్పుడు ఇన్నోటి నావెల్సు కథలూ గిలుకుతున్నారు కదా మన ఆడరైటర్స్ – తృణమో పణమో ముదుతూనే వుంది. కాని క్రిటిక్స్ ఎవరూ మన రాతల్ని గురించి పన్నెత్తి మాట్లాడ్డంలేదు. మనకున్న గ్లామర్‌ని చూసి ఉడుకుమోత్తనం చేత వాళ్ళలా చీమకుట్టినట్లయినా ఫీలవకుండా వుండటం నిజానికి ఏవీ బాగోలేదు.

ఆడవాళ్ళ రచనలను విమర్శించడానికి ఆడ క్రిటిక్స్‌ని మనవే తయారు చేసుకోవాలి కాని ప్రతి స్వల్ప విషయానికి మగవారి మీద ఆధారపడ్డం ఏవీ బాగోలేదు. కిట్టనివారు మన కీర్తికి మనవే డబ్బా వాయించుగోటం బావుండదేమో అంటారుగాని ఎవరి పెళ్ళికి వారే బాజాలు ఏర్పాటు చేసుగున్నట్లు, ఎవరి కీర్తికి వారు డప్పు కొట్టుకుంటే వచ్చిన నష్టమేమిటి నాకు తెలీకడుగుతాను.

మగవారు చచ్చిపోతే వారు కీర్తిశేషు లవుతారుకదా! మనం కీర్తి శేషమ్మ లవాలి కాని కీర్తి శేషయ్యలు మాత్రం కాకూడదు.